# స్వయం ప్రకాశం

కొద్దిగా నలిగిన లేతరంగు చీరలో, జారుముడితో... చేతిలో సంచీతో కూరల మార్కెట్‌లో నుంచి బయటికి వస్తున్న స్త్రీ భ్రమర అని చప్పున పోల్చుకోలేకపోయాను.

రోడ్డుకి ఇటువైపున కారు ఆపి అరటిపళ్ళు కొంటున్న నాకు అటువైపు నుంచి జాగ్రత్తగా రోడ్డు క్రాస్ చేసి వస్తున్న ఆమెని చూస్తుంటే... భ్రమరే అని ఖచ్చితంగా తెలిశాక కూడా కొంచెం సేపు అనుమానం వదల్లేదు.

ఎందుకంటే పాతికేళ్ళ గాఢ స్నేహంలో భ్రమర ఇలాంటి సాదా చీర కట్టుకోవడం నేనెప్పుడూ చూడలేదు.

భ్రమర అనగానే ఎవరికైనా చక్కగా గంజి పెట్టి ఇస్త్రీ చేసిన నేత చీరలలో యాక్టివ్‌గా వుండే అందమైన స్త్రీ మూర్తి కళ్ల ముందు మెదుల్తుంది.

ఆమె రోడ్ క్రాస్ చేసి ఇతలికి రాగానే... భ్రమరా! అని పిలవబోయాను. సరిగ్గా అప్పుడే తనూ నన్ను చూసింది.

"ఇందూ! ఇదేమిటి ఇక్కడున్నావు?" అంటూ వేగంగా దగ్గరకొచ్చింది.

ఆ వేగం చూశాక అప్పుడు ఆమె భ్రమరేనన్న నమ్మకం కలిగింది నా మనసుకి. యాభై ఏళ్ళ వయసులో అంత యాక్టివ్‌నెస్ భ్రమరకే సాధ్యం.

"నీ కోసమే తల్లీ! మీ ఇంటికే బయల్దేరాను" అన్నాను.

ఇంటికి వెళ్ళి తాళం తీయగానే... నేను సోఫాలో కూర్చుంటే, భ్రమర మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. ఆ తరువాత వంటగది గుమ్మం దగ్గర ఓ కుర్చీవేసి "ఇలా రా! ఇక్కడ కూర్చుని కబుర్లు చెప్పు. నేను కాస్త టిఫిన్ చేస్తాను" అంది.

మంచినీళ్ళ గ్లాసు పక్కన పెట్టి భ్రమర గదిలోకి వెళ్దామనుకుంటూన్న నేను ఆగిపోయాను.

నాకు సంబంధించినంతవరకూ భ్రమర గది ఓ స్వర్గం. ఒక అరగంట ఆ గదిలో కూర్చుంటే నెలరోజులు ఉత్సాహంగా పనిచేసుకునే శక్తి వస్తుంది నాకు.

సదా మంద్రంగా వినిపిస్తూండే సంగీతం... కిటికీ పక్కనున్న పారిజాతం చెట్టునుంచి తేలివచ్చే సువాసన... అందమైన దుప్పటి పరిచిన మంచం... ఆ పక్కనే వున్న టేబుల్ మీద లేటెస్ట్‌గా మార్కెట్‌లోకి వచ్చిన పుస్తకాలు...

ఇవీ ఆ గది అందాలు. ఎప్పుడు ఇక్కడికి వచ్చినా.. వెంటనే ఆ గదిలోకి పరుగెత్తి... ఆ మంచం మీద వాలిపోయి... ఆ సంగీతం వింటూ.. ఆ పుస్తకాలు తిరగేస్తూ... భ్రమర మాటలు వినే నాకు.. ఇవాళ అది వంటగది గుమ్మం దగ్గర కూర్చోమనడం అసలేం నచ్చలేదు.

"అబ్బ! ఇపుడు టిఫినేమీ వద్దులేవే! కాసేపు నీ గదిలో కూర్చుందాం పద!" అన్నాను.

"సరే. నువ్వెళ్లి కూర్చో అయితే. అయిదు నిమిషాల్లో వస్తాను. పిల్లలు ఆకలితో వస్తారు" అంది.

"పిల్లలకోసమా టిఫిన్!"

భ్రమర నవ్వింది. "నీ కోసం కూడాలే" అంది నా కినుకని గ్రహించినట్లు.

"సరే. త్వరగా కానీ మరి!" అంటూ మళ్ళీ సోఫాలోనే కూర్చున్నాను నేను.

"ఎన్నింటికొస్తాడు ఆనంద్!" అన్నాను భ్రమర పకోడీల కోసం పిండి కలుపుతుంటే చూస్తూ.

"వాడా! వాడికో టైమ్ లేదు. ఒకరోజు ఏడింటికి, ఒకరోజు ఎనిమిదింటికి. వాడిష్టం"

"మరి టిఫిన్‌కి హడావిడి ఏమిటి? ఇపుడు అయిదేగా అయింది!" అన్నాను ఆశ్చర్యంగా.

"వాడికోసం ఎవరు చేస్తున్నారు!" అంది భ్రమర అంతకన్నా ఆశ్చర్యంగా. "కోడలూ, మనవడూ వస్తారు కదా ఇప్పుడు!"

ఆమె మాట పూర్తికాకముందే సుగుణ లోపలికి వచ్చింది. పెదవులు కదిలీ కదలనట్లు నవ్వి "బాగున్నారా!" అంది ఏదో మర్యాదకి అడగాలి కదా అన్నట్లు.

"ఆఁ" అన్నాను నేను కూడా అంతే అనాసక్తిగా. నా కెందుకో ఆ అమ్మాయిని చూస్తే అసలు నవ్వాలని కూడా అనిపించదు.

వెంటనే మొహం తిప్పేసుకుని ఆమె వెనకే లోపలికి వచ్చిన పిల్లాడ్ని పలకరించాను.

చెప్పులు విప్పి, కాళ్ళు కడుక్కుని వచ్చి, సోఫాలో కూలబడింది సుగుణ. చేస్తున్న పని ఆపి భ్రమరాంబ కోడలికి, మనవడికి మంచినీళ్లిచ్చింది.

మనవడికి మొహం కడిగి స్కూల్ డ్రెస్ మార్చి వేరే డ్రెస్ వేసింది. అందరికీ పకోడీల ప్లేట్లు అందించింది.

ఆమె ఈ పనులన్నీ చేస్తున్నంతసేపూ సుగుణ కాళ్ళు టీపాయ్ మీదికి ఎత్తిపెట్టుకుని, తల సోఫాలో వెనక్కి వాల్చి అలా కూర్చునే వుంది.

కోడలికి భ్రమర చేస్తున్న సేవలు చూస్తుంటే నాకు వొళ్ళు మండిపోయింది. ఈ వయసులో అది అలా హడావిడి పడి పనులు చేస్తుంటే నా కళ్ళల్లో నీళ్లు తిరిగాయి కూడా. జీవితమంతా ఏమిటీ కష్టాలు దీనికి! అనిపించింది.

పాతికేళ్ళ వయసులో... సరిగ్గా పెళ్లయిన ఏడాదికి యాక్సిడెంట్‌లో భర్త పోయాడు. ఆ తర్వాత రెండు నెలలకి ఆనంద్ పుట్టాడు.

ఇన్నాళ్లూ... ఇన్నేళ్లూ.. వంటరిగా ఆ పిల్లాడ్ని చూసుకుంటూ బతికింది. వాడిని చదివించింది. మంచి ఉద్యోగస్థుడ్ని చేసింది. పిల్లని చూసి పెళ్ళిచేసింది. పోనీ ఇప్పుడయినా ఇక సుఖ పడ్తుందనుకుంటే ఇప్పుడీ చాకిరీనా!

భ్రమర తెచ్చిచ్చిన కాఫీ గ్లాసందుకుంటూ "వంట చేయాలిప్పుడు. ఆయన ఫ్రెండ్ కూడా వస్తారట. ఆఫీసుకి ఫోన్ చేసి చెప్పారు" అంది సుగుణ తనలో తను అనుకుంటున్నట్లుగా.

ఆమె ఎవరికి చెప్తోందో నాకు అర్థం కాలేదు. భ్రమరకి వంట డ్యూటీ వేసే పద్ధతా ఏమిటి ఇది! అనిపించింది.

నేను భ్రమర వైపు చురచురా చూస్తూ "నీతో కాస్త మాట్లాడదామని వచ్చాను నేను. ఆ గదిలో కూర్చుందాం రా!" అన్నాను.

నా అలుక చూసి చిన్నగా నవ్వి, మళ్లీ సుగుణ వైపు తిరిగి, "కూరలవీ ఏం తరగాలో ఇవ్వు. తరిగి ఇస్తాను" అంది భ్రమర.

సుగుణ సంచీలోనుంచి కూరలన్నీ బయటకి తీసి చూస్తుంటే, భ్రమర మళ్లీ వంటగదిలోకి వెళ్లి ఏవో సర్దసాగింది. నేను కూడా వెళ్లి వంటగదిలో నిల్చున్నాను.

భ్రమర పాలూ, డికాషనూ కలుపుతూండడం చూసి "ఇంకెవరికీ కాఫీ!" అన్నాను.

"నీకే. మళ్ళీ కాసేపాగి తాగుతావుగా!" అంది భ్రమర. గంటకోసారి కాఫీ తాగే అలవాటు నాకు.

"తాగితే! అప్పుడే కలుపుకోవచ్చుగా!" అన్నాను.

"కలిపేసి పెడితే అప్పుడు సుగుణ వేడి చేసి ఇస్తుంది" అంది భ్రమర అందులో పంచదార కూడా వేసేస్తూ.

ఆ తరువాత సుగుణ ఇచ్చిన కూరలూ, చాకూ తీసుకుని గదిలోకి నడిచింది.

నేను మంచంమీద కూర్చుంటే... అది టేబుల్ దగ్గర కూర్చుని కూరలు చెక్కుతీయడం మొదలు పెట్టింది.

సువాసనలతో, సంగీతాలతో, అదో కొత్త లోకంలా వుండే ఆ గదిలో... భ్రమర బంగాళాదుంపలు చెక్కు తీసి పడేస్తుంటే నా మనసు గిలగిలా కొట్టుకుంది.

"భోజనానికి ఒక్క మనిషి ఎక్కువొస్తే వండలేదా నీ కోడలు!" అన్నాను కొంచెం చిరాగ్గా.

"ఎందుకు వండలేదూ! వండుతోందిగా!" అంది భ్రమర తల ఎత్తకుండానే.

"ఎక్కడ! సగం పని నువ్వే చేస్తున్నావుగా!" అన్నాను.

భ్రమర నా మొహంలోకి చురుగ్గా చూసింది. "ఇంకా నయం! సగం పని ఏం చేస్తున్నాను! కూరలు తరిగి ఇస్తున్నాను. అంతేగా!" అంది.

"ఆవిడ ఇంతవరకూ వంటగదిలోకే వెళ్ళలేదుగా! సోఫాలో కూర్చుని వంట చేయాలి, వంట చేయాలి అనడమే సరిపోయింది కానీ!" ఈసారి నా గొంతులో కరుకుదనం స్పష్టంగా బయటపడింది.

భ్రమర నా వైపు ఆశ్చర్యంగా చూసింది. "ఎందుకే ఆ అమ్మాయంటే అంత చిరాకు నీకు!" అంది మందలింపుగా. "వంటగదిలోకి వెళ్ళకుండా ఎలా అవుతుంది! వంటగదిలోకి వెళ్లాలి, వంటా చేయాలి.

ఇప్పుడు వాడు ఫ్రెండ్‌ని తీసుకుని వస్తే... వాళ్లు కబుర్లూ, కాకరకాయలూ చెప్పుకుంటూ అర్ధరాత్రి పన్నెండింటి దాకా భోజనం చేస్తే, ఓపిగ్గా నిల్చుని వడ్డించాలి. ఆపైన అన్నీ సర్దుకోవాలి. మళ్లీ పొద్దున్నే లేచి ఆఫీసుకి పరుగెత్తాలి. మరో పక్కన

పిల్లాడ్ని సముదాయించుకోవడం, వాడికి కావల్సినవి చూడడం ఇవన్నీ ఎలాగూ వుంటాయి".

మాట్లాడుతూనే భ్రమర హడావిడిగా కూరలు తరిగేసింది. కంగారుగా చెక్కులన్నీ ఎత్తేస్తూ "వాడొచ్చేస్తాడేమో!" అనుకుంది. మళ్లీ అంతే కంగారుగా వంటగదిలోకి వెళ్లి కూరలు సుగుణకి ఇచ్చింది.

ఆ తరువాత తాపీగా వచ్చి, నా ఎదురుగా కూర్చుని "ఊ. ఇంక చెప్పు కబుర్లు!" అంది.

నేను మొహంలో పెద్ద క్వశ్చన్ మార్క్ పెట్టుకుని "ఏమిటే ఇదంతా!" అన్నాను.

"ఏదంతా!" అంది భ్రమర అర్థం కానట్టు.

"ఆనంద్‌ని చూసి భయపడతావా నువ్వు!" ప్రపంచ వింతని చూస్తున్నంత ఆశ్చర్యంగా అడిగాను.

భ్రమర నవ్వింది. "భయం కాదులే. వాడొచ్చేసరికి నేనేమన్నా పని చేస్తూ కనిపించానంటే ఇక ఒకటే గోల. మా అమ్మతో పని చేయిస్తావా అని ఆ అమ్మాయిని నాలుగు రోజులు సాధిస్తాడు. అందుకే వాడి ఎదురుగా నేనేమీ చేయను. ఏ సహాయం చేసినా వాడు లేనప్పుడే. వాడొచ్చాక ఇక పనంతా ఆ అమ్మాయే చేసుకుంటుంది పాపం" అంది.

నాకు మళ్ళీ చిరాకొచ్చింది. "పాపం అంటూ నువ్వంత జాలి పడాల్సిందేం లేదులే. భర్తకీ, పిల్లలకీ అన్నం వండి పెట్టడం కూడా శ్రమేనా! ఆ మాటకొస్తే నువ్వెన్ని కష్టాలు పడ్డావు యిన్నాళ్ళూ!" అన్నాను.

భ్రమర అదో రకంగా నవ్వింది. "నువ్వు కూడా అదేమాట అంటున్నావా!" అంది విరక్తిగా.

"ఆనంద్ అంటేనే నచ్చదు నాకు. కానీ ప్రాణస్నేహితురాలివి నన్ను మొదటినుండీ గమనిస్తున్నదానివి... నువ్వు కూడా, నన్ను అర్థం చేసుకోలేదంటే... నేను కష్టపడ్డానని అంటున్నావంటే... ఇక వాడు అనడంలో చిత్రమేముంది!"

భ్రమర అంటున్నదేమిటో నాకు అర్థం కాలేదు. "మొదటినుండీ గమనిస్తున్నాను కాబట్టే కదా నువ్వెంత కష్టపడుతున్నావో అర్థం చేసుకోగలిగాను!" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏమిటర్థం చేసుకున్నావు! నువ్వేమీ అర్థం చేసుకోలేదు. ఇన్నాళ్ళూ నువ్వు నన్నసలు సరిగా చూళ్లేదనీ, నా జీవిత విధానాన్నీ, ఆలోచనలనీ, దీక్షనీ.. దేన్నీ గమనించలేదనీ ఇవాళ నేను అర్థం చేసుకున్నాను" అంది భ్రమర.

"అంటే!" దానివైపు విడ్డూరంగా చూస్తూ అడిగాను నేను "నువ్వేమీ కష్టపడలేదంటావా!"

నా ఆశ్చర్యం చూసి భ్రమర మళ్లీ నవ్వింది. "ఎంత గాఢనమ్మకం మీ అందరికీ నేను జీవితంలో చాలా కష్టపడ్డానని! ఆనంద్ రోజుకి పదిసార్లన్నా అంటాడు మా అమ్మ చాలా కష్టపడింది, మా అమ్మ చాలా కష్టపడింది అని. అది వాడికి పారాయణ మంత్రం.

వాడి ముందు చిన్న పని చేస్తూ కనిపించినా చాలు... అమ్మా నువ్వు కూర్చో, నువ్వు కూర్చో అని హడావిడి చేస్తాడు.

సుగుణని పిల్చి, మా అమ్మ ఇన్నాళ్ళూ చాలా కష్టాలు పడింది. ఇప్పుడు కూడా ఇంకా కష్టపెడతావా! అని విరుచుకు పడతాడు.

చిత్రంగా అనిపిస్తుంది నాకు. ఆ అమ్మాయి బోలెడంత శారీరక శ్రమ చేస్తుంది. పొద్దున లేచినప్పటినుంచీ రాత్రి పడుకునే దాకా బొంగరంలా తిరుగుతూనే వుంటుంది. అదంతా అసలు కష్టంలాగానే కనిపించదు వాడికి.

ఇదుగో నువ్వన్నట్లే మొగుడికి అన్నం వండి పెట్టడం కూడా కష్టమేనా నీకు! అంటాడు. మరి ఆ మాటకొస్తే నేను ఆ మాత్రం శ్రమ కూడా పడలేదుగా! వండి పెట్టడానికి మొగుడే లేడు కదా నాకు...

మరింక వాడు నేను కష్టపడ్డానని ఎందుకంటాడో నాకు అర్థం కాదు. మా అమ్మ కష్టపడింది అన్న మాటని వాడు పదే పదే అంటుంటే భరించడం నా వల్ల కావడం లేదు".

నేను దానివైపు సూటిగా చూశాను. "భర్త లేకపోవడం... సంసార సుఖానికి దూరమై, కోరికలు చంపుకుని బతకాల్సి రావడం కష్టం కాదా!" అన్నాను నిలదీస్తున్నట్లుగా.

"వాడు ఆ కష్టం గురించి మాట్లాడుతున్నట్లయితే అది అసలు భరించలేని విషయం" అంది భ్రమర.

నేను అవాక్కయ్యాను ఆ సమాధానానికి. నిజమే. ఆ కష్టం గురించి కొడుకు మాట్లాడితే ఇబ్బందిగా వుండడం సహజమే. అయితే అంతకు మించి భ్రమర ఏ కష్టమూ పడలేదా!

నేను ఆలోచిస్తుంటే దాని మాటలు మళ్ళీ వినిపించాయి. "మీరందరూ అనుకుంటున్నట్లు నేనేమీ కష్టపడలేదు. నా జీవితంలో ఒక ఇబ్బంది వచ్చింది నిజమే. కానీ నేను దానికి బాధపడదల్చుకోలేదు.

నేను ఆనందంగా వుండాలని తీర్మానించుకుంటే నన్ను బాధ పెట్టగల పరిస్థితి ఏముంటుంది! నేను నవ్వుతూ వుండాలి అని నిర్ణయించుకున్నాక, నా పెదవుల మీదికి చిరునవ్వు రాకుండా ఆపగల శక్తి ఎవరికుంటుంది! నవ్వాలి అనేది నా మనసులో జరిగే నిర్ణయం. నా మనసుకీ, పెదవులకీ మధ్య మరెవ్వరూ లేనపుడు నా నుంచి నవ్వు ఎలా దూరమవుతుంది!"

భ్రమర నిట్టూరుస్తూ చెప్పింది. "శ్రీధర్ చనిపోయాడని తెలిసినప్పుడు మొదట షాకింగ్‌గానే అనిపించింది. కానీ నేను వెంటనే తేరుకున్నాను. నన్ను నేను కష్టపెట్టుకోకూడదనీ, ఒకరు సానుభూతి చూపేటట్లుగా వుండకూడదనీ అనుకున్నాను.

నా జీవితాన్ని జాగ్రత్తగా మలుపు తిప్పుకుని, సంగీతమూ, సాహిత్యమూ... ఒకటేమిటి! ప్రపంచంలో వున్న ఆహ్లాదాలన్నిటినీ నా ఇంటి ముంగిటిలోకి తెచ్చుకుని ఆనందంగా బతికాను. నాకొచ్చిన కష్టాన్ని నేను జయించాను.

ఆ విజయాన్ని మీరెవరూ గుర్తించకపోవడం... పదే పదే నువు కష్టపడ్డావు, కష్టపడ్డావు అంటూ సానుభూతి చూపడం... నాకు ఆనందాన్ని కలిగించదు... అవమానకరంగా అనిపిస్తుంది".

తలవంచుకుని భ్రమర మాటలు వింటున్న నేను ఒకరకమైన ఉద్విగ్నతతో మెల్లగా తలెత్తాను.

నిజమే. భ్రమర జీవితం మొత్తాన్నీ గుర్తు చేసుకుంటే ఇపుడర్థమవుతోంది. అది ఏనాడూ కష్టపడలేదు. కష్టాలు వచ్చాయి నిజమే, కానీ అది కష్టపడలేదు.

దానిలో వున్న ఆ సామర్థ్యాన్ని ఇంత దగ్గరి స్నేహితురాల్నయి వుండీ గుర్తించకపోవడం ఎంత తప్పో తెలియగానే... మెల్లగా గొంతు పెగుల్చుకుని "సా... రీ" అన్నాను. "నేను అంత దూరం ఆలోచించలేదు. కష్టం రావడానికీ, కష్టపడడానికీ తేడా వుంటుందని నేను అర్థం చేసుకోలేదు".

నా మాటలకి భ్రమర పెదవులపైన మళ్లీ అదే అందమైన నవ్వు మెరిసింది. "నువ్వు అనాలోచితంగా అన్నావు, నాకు తెలుసు. అందుకే నీ మాటలు నన్ను అంతగా బాధించలేదు. కానీ ఆనంద్ అలా అన్నప్పుడు అందులో ఆలోచన లేకపోవడంతో పాటు వాడి స్వార్థం కూడా కనిపిస్తుంది. అందుకే వాడు మా అమ్మ కష్టపడింది అంటే అది మరీ అవమానకరంగా అనిపిస్తుంది".

"స్వార్థమా!" నేను ఆశ్చర్యపోతూ అడిగాను.

"ఊ. భార్యని ప్రేమించడం బలహీనత అనీ, తల్లిని ప్రేమించడం మంచితనమనీ నమ్మడం లోకరీతి కదా! వాడు అందుకు అతీతుడు కాడు.

అందుకే భార్య ఎంత కష్టపడినా, వాడినుంచి సానుభూతిని ఆశిస్తున్నా... వాడు పట్టించుకోడు. భార్య కష్టానికి ఓదార్పుగా ఒక్క మాట మాట్లాడడు.

తల్లి ఆనందంగా తిరుగుతున్నా, నాకీ అనవసరపు సానుభూతి వద్దు నాయనా! అని పదే పదే చెప్తున్నా ఆమె పైన మాత్రం సానుభూతి కురిపిస్తూనే వుంటాడు. తాను మంచి అనిపించుకోవాలనే ఆరాటమే తప్ప... ఎవరు కోరుకునేది వాళ్ళకి ఇద్దామనే ఆలోచన లేదు వాడికి".

భ్రమర దగ్గరికి ఎపుడు వచ్చినా ఇంతే. వచ్చేటప్పుడు గలగలా మాట్లాడుతూ వస్తాను. ఇక్కడికి వచ్చాక భ్రమర విశ్లేషణలతో... అది వెలిబుచ్చే విజ్ఞానంతో తడిసి ముద్దై... గొంతు భారమై మాట్లాడలేని స్థితిలో బయటకి వెళ్తాను.

ఈ రోజూ అదే పరిస్థితిలో వెళ్ళొస్తానని చెప్పి లేచాను. గదిలో నుంచి ఇవతలికి వస్తూంటే... "ఆంటీ! ఒక్క నిమిషం... కాఫీ తెస్తున్నాను" అన్న సుగుణ కేక వినపడింది.

ఆ కేకతోపాటూ ట్రేలో రెండు కప్పులతో వంట గదిలోనుంచి పరుగెత్తుకు వచ్చిన సుగుణ కనిపించింది. ఆమెని చూసి నేను ఆశ్చర్యపోయాను.

నేనెప్పుడూ అనుకోలేదు, సుగుణ అంత అందంగా వుంటుందని.

ఆమె పరుగెత్తుకు రావడంలోనూ... ట్రే పట్టుకోవడంలోనూ... మొహంలోని చిరునవ్వులోనూ... మెరిసే కళ్ళలోనూ ఏదో కొత్త అందం.

నేను ఆమె వైపు అబ్బురంగా చూస్తూ "చాలా లేటయిపోయింది. ఇప్పుడింక కాఫీ ఎందుకులే. బయల్దేరానుగా" అన్నాను.

"మాటల్లోపడి నేను మర్చిపోయాను, ఇందాకే ఇవ్వవలసింది" భ్రమర నొచ్చుకుంటున్నట్లుగా అంది. "పోనీ కొంచెం తాగి వెళ్లు. తీసుకు వచ్చిందిగా!" అంటూ నా చేతికొక కప్పు ఇచ్చి తానొక కప్పు తీసుకుంది.

"ఇందాకే తెచ్చానత్తయ్యా! కానీ తలుపు దగ్గరికి రాగానే మీ మాటలు వినిపించాయి. వింటూ నిలబడిపోయాను" సుగుణ మాటలకి నేను వులిక్కిపడి భ్రమర వైపు చూశాను.

"మన కష్టాన్ని చూసుకుని మనమే బాధపడడం అనవసరమయితే... ఎదుటివాళ్లు బాధపడాలని కోరుకోవడం అసహ్యమని ఇవాళ మీ మాటలు వింటూంటే అర్థమయింది నాకు. అంత గొప్ప విషయాన్ని తెలుసుకునే ప్రయత్నంలో... " భుజాలు కుదిస్తూ నవ్వింది సుగుణ. "కాఫీ కాస్తా చల్లారిపోయింది. అందుకే మళ్లీ వేడిచేసి తీసుకువచ్చాను"

ఆ మాటలు చెప్పేసి సుగుణ వంటగదిలోకి వెళ్ళిపోతుంటే... వున్నట్లుండి ఆమె అద్భుతంగా కనపడటానికి కారణమేమిటో నాకు అర్థమయింది. ఎదుటివాళ్ళ నుంచి సానుభూతిని కూడా ఆశించని మనుషుల తేజస్సు ఎలా ఉంటుందో అనుభవమయింది.

<u>రచనాకాలం : 2001</u>